పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకులు పి.స్రవంతి అన్నారు. కొండపల్లి డీఏవీ పాఠశాల, గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాలల్లో పర్యావరణ విద్య కార్యక్రమం త్వరలో అమలు జరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ , ప్రస్తుతం జరుగుతున్న వాతావరణ మార్పులపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రాజెక్ట్ అధికారి సత్యనారాయణ, ఎంఈఓ సీహెచ్ పుష్పలత, క్లస్టర్ కో–ఆర్డినేటర్ సాయి రుస్సీసా బేగం పాల్గొన్నారు.

పాఠశాలల్లో 'జన్ భగీరథి'

తిరువూరు: విజయవాడలో ఈ నెల 19వ తేదీన 125 అడుగుల బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు తిరువూరు మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం జన్ భగీరథి కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీపురం ఎంపీయూపీ, అక్కపాలెం ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వెంకట దుర్గావతికి గణితంలో పీహెచ్‌డీ

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఆర్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య పర్యవేక్షణలో దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల అధ్యాపకురాలు పి.వెంకట దుర్గావతికి గ్రాఫ్ థియరీలో చేసిన పరిశోధనలకు కృష్ణా యూనివర్సిటీ గణితంలో పీహెచ్‌డీ అందించింది. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య సోమవారం ఆమెను అభినందించారు. గ్రాఫ్ థియరీలో 'సమ్ స్టడీస్ ఆన్ సైన్డ్ యాని డ్యామినేటింగ్ అండ్ ఫంక్షన్స్ ఆఫ్ రూటెడ్ ప్రాడక్ట్ గ్రాఫ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం కృష్ణా యూనివర్సిటీకి అందజేసినందుకు ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

108 సార్లు విష్ణు సహస్రనామ పారాయణ

తిరువూరు: స్థానిక కోదండ రామాలయంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 108 సార్లు విష్ణు సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. నల్లాన్‌చక్రవర్తుల విఠలాచార్యులు, మరింగంటి పార్థసారథాచార్యులు ఆధ్వర్యంలో 108 మంది మహిళా భక్తులు ఈ సహస్ర నామ పారాయణంలో పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్లతో పేదలకు మెరుగైన వైద్యం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

కాచవరం(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ అన్నారు. మండలంలో కాచవరం, కొటికలపూడి గ్రామాల్లో సుమారు రూ.41.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లను సోమవారం ప్రారంభించారు. ప్రతి 2,500 మందికి ఒక వెల్‌నెస్ సెంటర్ నిర్మించి ఖర్చులేని 12 రకాల వైద్య సేవలు, 14రకాల వైద్యపరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. కొటికలపూడిలో ప్రేమధార సంస్థ, జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించిన రైతు ఉత్పత్తుల పరస్పర సహకార సంఘం గోడౌన్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రేమధార సంస్థ మేనేజర్ జోష్ బాబు, సీఈఓ బి.వెంకటేశ్వరరావు ఇబ్రహీంపట్నం, జికొండూరు మండలాల రైతులకు సంఘం ద్వారా అందుతున్న వ్యవసాయ సేవలు తెలిపారు. ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, వైస్ ఎంపీపీ బండి నాగమణి, సర్పంచులు డి. రాజేంద్రప్రసాద్, రెంటపల్లి నాగరాజు, ఎంపీటీసీ రంగస్వామి, ఎంపీడీవో రామకృష్ణనాయక్, డాక్టర్ పర్వీన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, దుర్గగుడి కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



కాచవరంలో వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

దేవినేని ఉమా క్షమాపణ చెప్పాలి

నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. తనపై చేసిన ఆరోపణలపై లీగల్ నోటీసులు పంపినట్లు తెలిపారు. నోటీసుకు కనీస సమాధానం ఇవ్వకుండా మళ్లీ తాజాగా సోషల్ మీడియా వేదికగా పాత క్లిప్పింగ్‌లతో బూటకపు ప్రచారానికి తెరలేపారన్నారు. ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో చట్ట పరిధిలో తదుపరి చర్యలకు ఉపక్రమిస్తానని స్పష్టం చేశారు.

సంక్షిప్త వార్తలు

'జగనన్న పాలవెల్లువ' సంఘానికి రుణాలు

జి.కొండూరు: మండలంలోని గంగినేని గ్రామంలో జగనన్న పాలవెల్లువ పథకం కింద అమూల్ డెయిరీకి పాలను ఉత్పత్తి చేస్తున్న మహిళా సంఘానికి జి.కొండూరు కేడీసీసీ బ్యాంకు రుణాలను మంజూరు చేసింది. ఈ రుణాల చెక్కులను లబ్ధిదారులకు గంగినేని పీఏసీఎస్ చైర్మన్ అన్నంశెట్టి వెంకట్రావు చేతులమీదుగా జి.కొండూరు కేడీసీసీ బ్యాంకులో సోమవారం అందజేశారు.

16న ఏపీ పవర్ జనరేటింగ్ యూనియన్ రజతోత్సవం

ఇబ్రహీంపట్నం: ఏపీ పవర్ జనరేటింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రజతోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ నెల 16న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో హట్టహాసంగా 25వ ఆవిర్భావ దినోత్సవం రజతోత్సవం ఏర్పాట్లు చేసినట్లు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే శ్రీనివాస్‌కుమార్ సోమవారం తెలిపారు. వేడుకల్లో రాష్ట్ర గృహనిర్మాణ శాఖమంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, రాష్ట్ర యూనియన్ నాయకులు పాల్గొంటారు.

సైన్స్ సంబరాల్లో తృతీయ స్థానం

ఏ.కొండూరు: మండలంలోని కంభంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9, 10వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు జిల్లా స్థాయిలో చెకుముకి సైన్స్ సంబరాల్లో తృతీయ స్థానం సంపాదించారని హెచ్‌ఎం జే ఆదిశేషు సోమవారం తెలిపారు. విజయవాడలో శరత్‌చంద్ర అకాడమీలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా జరిగిన చెకుముకి సైన్స్ సంబరాల్లో శ్యామ్ కృష్ణ, చరణ్, రవిచంద్ర ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచారు.

సంక్రాంతి సంబరాలు

తిరువూరు: స్థానిక నారాయణ స్కూల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సీఐ అబ్దుల్‌నబీ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బాలబాలికలకు భోగి పండ్లు పోసి సంక్రాంతి పండుగ విశిష్టతను తెలిపారు. పాఠశాల ఏజీఎం హరీష్, ఆర్ఐ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ వెంకటరత్నం పాల్గొన్నారు.

పేదల ఆరాధ్య దైవం వంగవీటి రంగా

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

మైలవరం: బడుగు, బలహీన వర్గాల ఆరాధ్య దైవం వంగవీటి మోహన రంగా అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం ప్రధాన కూడలిలో వంగవీటి మోహన రంగా కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే వసంత, ప్రముఖ సీఏ సుంకర అక్కయ్యనాయుడు, ఆకుల శ్రీనివాసకుమార్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషుతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు రంగా ఎంతో అండగా నిలిచారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. రంగా మృతి చెంది 35 సంవత్సరాలు గడచినా ఇంకా రాష్ట్ర ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదన్నారు. ఉయ్యూరు సమీపంలోని మూరుమూల గ్రామంలో జన్మించిన వంగవీటి రాధా, రంగా సోదరులు అనతి కాలంలోనే విజయవాడలో రాజకీయ ప్రస్థానం ప్రారంభించారన్నారు. రంగా లేని లోటు పూడ్చలేనదని, ఆయన విగ్రహం ఆవిష్కరించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే వసంత తెలిపారు.



మైలవరంలో రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్